


'విజాతి బలాలు ఆకర్షించుకుంటాయి, సజాతి బలాలు వికర్షించుకుంటాయి' అని చిన్నప్పుడు చదువుకున్నాను. అప్పుడా పాఠం రాలేదని సైన్సు మాస్టారు ఓ రోజల్లా బళ్ళో గోడ కుర్చీ వేయించారు. సిగ్గుతో చితికిపోయాను. ఇప్పుడు తెలుస్తోంది ఆ పాఠం చదివి ఎంత మోసపోయానో!

మా ఆవిడ చాల యాక్టివ్. నేను వెరీ కావ్ గోయింగ్. ఆవిడ పడిలేచే కడలి తరంగం. నేను మన్ను తిన్న పాముని. మొగుడు మరీ అంత బుద్ధిమంతుడిలా వుండకూడదంటుంది తను. శ్రీరామ చంద్రుళ్ళాటి మొగుళ్ళని తన బోటి పెళ్ళాలు సహించర్ట. ఆ సహించకపోవడం వల్లనే పెళ్ళయిన ఈ ఐదేళ్ళలో మా యిద్దరి మధ్యా చిన్న చిన్న తగాదాలు చాల వచ్చాయి. నిజానికవి తగాదాలు కావు. మా వ్యక్తిత్వాలలో వచ్చిన ఘర్షణ. ఒకరి కొకరం తీసిపోకూడదన్న పట్టుదల. విజాతి బలాలు ఆకర్షించుకుంటాయన్నది అలా మా పట్ల అబద్ధమైంది.

మా ఆవిడ ఈ మధ్య నా మీద చీటికీ మాటికీ విసుక్కుంటోంది. డైరెక్ట్‌గా నా మీద విసుక్కోకపోయినా అవి నాకు ఆపాదించినవేనని నాకు తెలుసు.

నాకు విజయవాడంటే ప్రాణం. మా ఆవిడకు మా ఊరంటే ఎక్కడలేని విసుగు. "ఇక్కడే పాతుకు పోయి ఏం చెయ్యాలని! నేను కాబట్టి సాగుతున్నాయి మీ ఆటలు. ఇంకోళ్ళయితే నెత్తి మీద మొట్టి ఎప్పుడో పోయుండేవారు... ఓ పెళ్ళామూ అచ్చటా ముచ్చటా వుంటేగా! ప్రొద్దున లేచినప్పటినుంచి తమ్ముళ్ళా చెల్లెళ్ళా... రేపు వాళ్ళకి పెళ్ళిళ్ళయితే మీ మొహం చూసేవాళ్ళు ఒక్కళ్ళుండరు. అడిగితే రాక్షసి, దయ్యమూ అంటారు. కానరానిదంటారు. పక్కవాళ్ళ పాడ గిట్టదంటారు. అసలంతలా వాళ్ళకే అంకితమై పోవాలనుకున్నవాళ్ళు పెళ్ళెందుకు చేసుకున్నారు? నేను పిచ్చిమొద్దుని కాబట్టి సర్దుకు పోతున్నా."

"అవును. నువ్వూ మీ నాన్న పిచ్చి మొద్దులు. అదే అనుకుంటున్నారంతా. గుండెలు తీసిన బంట్లు మీరు. నువ్వు రైఫిల్ రాణివి. ఆయన దొంగలకు దొంగ. మీరిద్దరూ గూడు

పుతాణీ చేశారు. ఆయన సరివి బాదులా నిలబడి 'నా కూతురు అద్భుతం. మా అమ్మాయి తెలివితేటలు అమోఘం. మా అమ్మాయి ప్రేమించిందంటే అది అవతలివాడి అదృష్టం. మా అమ్మాయి చెయ్యందుకునే అదృష్టం నీకు కాగా దక్కింది'అని గాడిదను చేశాడు నన్ను."

"గాడిదకేం తెలుసు గంథం వాసన"

ఇంక మాట్లాడకపోవటం ఉత్తమం!

"నా ఖర్మ!పుట్టిల్లు కూడా ఈ వూరే అయిపోయింది. అందరికిమల్లే నాలుగురోజులు పుట్టింటకని యింకో వూరు వెళ్ళొచ్చే ప్రాప్తి లేదు."

"ఇప్పుడేమయిందోయ్" అన్నాను మాట ల్లోకి దింపుదామని.

"ఏమైందా... అసలు నాతో మాట్లాడ కండి. లేచి ముందిక్కడ నుంచి వెళ్ళండి. మా బావగారిని చూసి బుద్ధి తెచ్చుకోండి. ఆయన కున్న ప్రేమ మీకెక్కడిది? మా అక్కంటే ఆయనకు ఎంత ప్రేమ... ఎంత ఎఫెక్షను..." అని చివాలున లేచి వెళ్ళిపోయింది.

ఇది జరిగిన రెండు రోజులకి నాకు ట్రాన్స్‌ఫరొచ్చింది.మా ఆవిడకి పండగొచ్చింది. వాళ్ళ నాన్నగారికి రైల్వేలో ఉద్యోగం. అందుకని చెప్పాపెట్టకుండా మరునాటికల్లా ఢిల్లీకి రెండు టిక్కెట్లు తెప్పించింది. రెండు సూట్‌కేసుల నిండా గబగబా బట్టలు సర్దింది. అత్తగారితో ఎక్కడలేని సయోధ్యా సాధించి వూరగాయలతో హార్లిక్స్ సీసాలు నింపింది. ఛలో ఢిల్లీ అంది.

ఇంక ఆరోజు మధ్యాహ్నం తమిళనాడులో ప్రయాణం. రైలు ఒకటిన్నరకి. క్రితం రాత్రి నుంచే ఏడుస్తున్నాను. కళ్ళు వాచాయి. ఏడున్న రకి లేచాను. కాఫీ తాగి బీసెంటు రోడ్డు, గాంధీనగరం, సత్యనారాయణపురం, లబ్బీపేట అన్నీ తిరిగొచ్చాను. ఇంటికొచ్చాక దిండులో ముఖం దాచుకుని మళ్ళీ ఏడ్చాను. ఇరవై ఏళ్ళ అనుబంధం. అమ్మా, చెల్లెళ్ళూ, అక్కలూ, తమ్ముళ్ళూ, మేనమామ పిల్లలూ వీరందరి మధ్యా బతికినవాణ్ణి. ఆ ఎటాచ్‌మెంట్ అంత త్వరగా తెంపేసుకోలేనిది.

"ఎవరు లేకపోయినా నేనున్నాగా" అంది మా ఆవిడ.

"నీ ప్రేమ పట్ల నాకు విశ్వాసం వుంది కాని నా మీద నాకు విశ్వాసం పోయింది" అన్నాను.

ఢిల్లీ వెళ్ళాం. అక్కడికి వెళ్ళాక బతుకంటే



భయం పట్టుకుంది. కాని అదీ అలవాటైంది. ఓ సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక గుండెల మీద నిమురుతూ చుట్టుపక్కల యిళ్ళన్నీ చూపుడు వేలుతో చూపించింది నా ప్రియ సఖి.

"ఏమైంది, ఏమిటీ మూగ భాష..."

నవ్వుతూ నవ్వుతూ మధ్యలో ఎక్కడో సన్నాయి నొక్కు నొక్కింది మా ఆవిడ "టీవీ" అంటూ. "నిక్షేపంగా అందరికీ టీవీలున్నాయి క్కడ. మన ఖర్మేం కాలిందీ మనమూ కొనుక్కుందాం" అని చిన్నగా ఫీలర్ వదిలింది. ఆ తరువాత నాలుగు రోజులకి గ్వాలియర్ నుంచి మా ఆవిడ మేనమామా, ఆయన భార్యా పిల్లలూ గాలి దుమారంలా వచ్చారు.

"ఫ్రిజ్ లేదా మీకు! ఫ్రిజ్ లేకుండా ఎలా బతుకుతున్నారే ఢిల్లీలో" అందావిడ.

అంతే తరువాత నాలుగు రాత్రులు నిద్దర లేకుండా పోయింది నాకు. మంచి నీళ్ళు అడిగినప్పుడల్లా మా ఆవిడ బిందెలూ, చెంబులూ పగలగొడుతుండేది.

ఇంక లాభంలేదు. ఇన్నాళ్ళూ కష్టపడి బ్యాంకులో దాచిన అయిదారువేలకీ కాళ్ళొచ్చేలా వున్నాయి అని నాలో నేను ఏడుస్తున్న సమయంలో అద్భుతమూ అనూహ్యమూ అయిన పరిణామాలు సంభవించాయి. ఆసియా క్రీడోత్సవాల సంరంభం, హడావిడి మొదలయ్యాయి. వాటిని వీక్షించి జన్మ చరితార్థం చేసుకునేం దుకు అమాత్యులవారు రంగుల టెలివిజన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అమ్మయ్య! ఊపిరొచ్చినట్టయింది నాకు. ఆ రాత్రి మా ఆవిడ పక్కనించి నల్లిలా కుట్టటం మొదలెటినప్పుడు సీరియస్‌గానే ఆవిడ కళ్ళలోకి చూసి అడిగాను. "ఇన్నాళ్ళూ ఆగి యిప్పుడు తొందరపడి యీ బ్లాక్ అండ్ వైట్ టీవీ కొందామంటావా? నాలుగు రోజులాగితే నీ సొమ్మేం పోయె! హాయిగా రంగుల టీవీ కొనుక్కోవచ్చుగా."

"నిజమే" అంది మా పిచ్చిమొద్దు.

మరునాడు నిద్రలేస్తూనే యిరుగూ పొరుగూ అందరితో చెప్పింది నాలుగురోజులాగి ఏకంగా కలర్ టీవీయే కొందామనుకుంటున్నామని. మా ఆవిడ దూరదృష్టిని వాళ్ళందరూ అభినందించారు. అలా అని నాతో చెప్తూ "మరి రిఫ్రిజిరేటర్" అంది.

"ఆగు కొంచెం నిదానించు. కార్లు విమానాలు వంటింటి కుక్కర్లు పంపుసెట్లు నువు కలలుకనే రిఫ్రిజిరేటర్లు అన్నీ సౌరశక్తితో నడిచే రోజు లొస్తున్నాయి. నాలుగురూపాయలు ఎక్కువైనా అప్పుడు కొనుక్కోవటం మంచిది. ఈ లోపల మన పెళ్ళికొచ్చిన ఐస్ ఫ్లాస్కుతో కాలక్షేపం చేద్దాం" అన్నాను.

ఏ కళ నుందో మా శిఖండి ఒప్పుకొంది.

గండం గడిచిందనుకుంటుండగా గోడకు కొట్టిన బంతిలా గిర్రున మళ్ళీ వెనక్కి తిరిగొచ్చి "ఇంతకీ స్కూటర్ సంగతేం చేశారు. బాబిగాడ్ని రేపటి నుంచి ఆ డిటీసీ బస్సులో బడికి పంపమంటే నేను చచ్చినా పంపను" అంది.

"స్కూటర్ కొనదలుచుకోలేదింక. నిన్నో మొన్నో వార్తల్లో చెప్పారు. మారుతీ కారు మార్కెట్లో కొచ్చేసిందిట.అది బుక్ చేద్దామనుకుంటున్నాను. స్మాల్ అండ్ కాంపాక్ట్. మోస్ట్ అల్ట్రా మోడర్న్" అని భుజాలెగరేసాను.

"పోన్లెండి. కారు కొందామని మీకిన్నాళ్ళకో మంచి బుద్ధి పుట్టింది. కొనేటప్పుడు ఔట్ డేటెడ్ జంక్ కొనట మెందుకు నిక్షేపంగా మారుతీయే కొనుక్కుందాం. అయినా మాశారా ఢిల్లీ వచ్చారు కాబట్టి కారు, పెళ్ళాం, కరోల్‌బాగ్ సెంటరూ ఇన్ని తెలిసాయి మీకు, లేకపోతే 'ఇరవైలో అరవయ్యే' " అని మెడ చుట్టూ చేతులు వేసింది.

నేను పైకి నవ్వుతూనే మనసులో వెయ్యి దేముళ్ళకు మొక్కుకున్నాను.రాత్రికి మా ఆవిడ కళ్ళనిండా కలర్ టీవీలు, మారుతీ కార్లు.